చెరువుల్లా రోడ్లు, ఖాళీ స్థలాలు

- దుర్గంధం, విజృంభిస్తున్న దోమలు
- శాంతి నగర్ వాసుల వెతలు



చెరువును తలపిస్తున్న శాంతి నగర్ 3వ రోడ్డుపై ఉన్న గుంత



శాంతినగర్ 6, 7 రోడ్ల మధ్యలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పసర్లు కట్టిన నీరు



శాంతనగర్ 4వ రోడ్డులో ఖాళీ స్థలంలో పసర్లు కట్టిన నీరు



శాంతినగర్ 4వ రోడ్డులో డ్రెయిన్ లేక ఖాళీ స్థలంలోకి వస్తున్న మురుగు నీరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధ్వంసమైన రోడ్లు. రోడ్డు గుంతల్లో వర్షం నీరు. ఖాళీ స్థలాల్లో తిష్ట వేసిన మురుగు, వర్షం నీరు. వెదజల్లుతున్న దుర్గంధం. విజృంభిస్తున్న దోమలు. ఇలా పలు సమస్యలతో ఏలూరులోని శాంతి నగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం రోడ్లు చిధ్రమయ్యాయి. డ్రెయిన్లు పాడైపోయాయి. ఇటీవల కురిసిన వర్షానికి నీరు వీధుల్లోనే ఎక్కడికక్కడ నిల్వ ఉండడంతో, ఈ నీటిలోనే శాంతి నగర్ వాసులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రోడ్లు, డ్రెయిన్లను పునర్నిర్మించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదని శాంతినగర్ వాసులు వాపోతున్నారు.

ఖాళీ స్థలాలతో ఇళ్లకు ముప్పు

శాంతి నగర్‌లో ఉన్న ఖాళీ స్థలాల్లోకి వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని స్థలాలు మరీ లోతుగా ఉండడంతో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటుంది. వీటి వల్ల నేల మెత్తబడి పక్కన ఉన్న గృహాలు కుంగి పోతున్నాయని యజమానులు భయాందోళన చెందుతున్నారు. మరికొన్ని గృహాల ప్రహరీలు ఈ ఖాళీ స్థలాల్లో నీరు కారణంగా ఒక పక్కకి ఒరికిపోయి ఎప్పుడైనా పడిపోయే ప్రమాదం ఏర్పడింది.

పసర్లు కడుతున్న నీరు

ఖాళీ స్థలాల్లో చేరిన వర్షపు నీరు పసర్లు కడుతున్నాయి. డ్రెయిన్లు లేకపోవడంతో అపార్టుమెంట్లు, గృహాల్లో వినియోగించిన నీరు ఆ ప్రాంతంలో చేరి దుర్గం వెదజల్లుతోంది. కొన్ని స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. నీరు పసర్లు కట్టడంతో దుర్వాసన వెదజల్లి, దోమల విజృంభణతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దోమల కారణంగా ప్రజలు తరచూ అనారోగ్యం పాలౌతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



మా అపార్ట్‌మెంట్ పక్కనే ఖాళీ స్థలం ఎప్పుడూ నీటితోనే నిండి ఉంటుంది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే అప్పుడప్పుడూ వచ్చి నీరు తోడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు నీరు చేరుతుంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నా అధికారుల నుంచి స్పందన లభించడం లేదు. డ్రెయినేజీ నీరు కూడా కొన్ని ఖాళీ స్థలాల్లోకి చేరుతూ దుర్గంధం వెదజల్లుతుంది.

– మార్గాని నాగ శ్రీకాంత్, శాంతి నగర్ నివాసి

రోడ్లు వేయాలి



శాంతి నగర్‌లో కొన్ని వీధుల్లోకి అడుగుపెట్టాలంటే భయం వేస్తుంది. రోడ్లు వేయకపోవడంతో చెరువుల్లా కనిపిస్తున్నాయి. ఎప్పుడు ఏ గుంతలో పడతామో అని ఆందోళనగా ఉంది. ఖాళీ స్థలాల్లో చేరిన నీరు మురుగుగా మారి దోమలు వ్యాపిస్తున్నాయి. దోమల కారణంగా మా ప్రాంత వాసులు తరచూ అనారోగ్యం పాలౌతున్నారు. వెంటనే రోడ్లు వేసి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– శేషారావు, శాంతి నగర్, హిమాని ఎన్‌క్లేవ్ ఫ్లాట్ యజమాని

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో విజేత రిషిత



ఏలూరు (ఆర్ఆర్‌పేట): సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కె.రిషిత విజేతగా నిలవడం జిల్లాకు గర్వకారణమని జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకట లక్ష్మమ్మ అన్నారు. నిడమర్రు మండలం చిన్ననింద్రకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రిషిత వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతగా నిలిచిందన్నారు. రిషితను జిల్లా సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త కె.పంకజ్ కుమార్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రెడ్డి రామారావు, నిడమర్రు మండల విద్యాశాఖాధికారులు అనురాధ, శేషగిరిరావు, ప్రధానోపాధ్యాయుడు జి.మల్లికార్జునరావు అభినందించారని పేర్కొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్) / ఏలూరు (ఆర్ఆర్‌పేట): మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రకళ, ఎం నాగమణి ఒక ప్రకటన విడుదల చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో జిల్లాలో పనిచేస్తున్న 3200 మంది కార్మికులు మూడు నెలల నుంచి వేతనం కానీ, బిల్లులు కానీ ప్రభుత్వం చెల్లించ లేదని పేర్కొన్నారు. ఈ పథకాన్ని ఇప్పటికే కార్మికులు తన సొంత పెట్టుబడులతో నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ పథకానికి వెంటనే బడ్జెట్ కేటాయించాలని, కార్మికులకు నెలనెలా 5వ తేదీలోపు వేతనం చెల్లించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'చలో తిరుపతి'ని విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): తిరుపతిలో ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించే బంజారా మహంతు శ్రీశ్రీశ్రీ హాతిరాం బావాజీ జీవ సమాధి దివస్ బర్సి ఉత్సవం సందర్భంగా నిర్వహించే చలో తిరుపతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీ బంజారా లంబాడి సుగాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.కృష్ణా నాయక్, డి.రాజాబాబు నాయక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 14న సేవాగడ్‌లో ప్రారంభమైన సేవాలాల్ జ్యోతి ఝూరీ రథం 18న తిరుపతి హాథిరాం బావాజీ మఠం చేరుకుంటుందని, 19న హాథిరాం పల్లకీ యాత్ర హాతిరామ్ మఠం నుంచి హాతీ ఘడ్ వరకు సేవాలాల్ జ్యోతి యాత్ర హాతిరాం బావాజీ జీవ సమాధి వద్ద మహాభోగ్ సాధుసంతుల సందేశం ఝూరీ కానుక ప్రదానం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

భూమిపై హక్కుతోనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు భూమిపై హక్కు కల్పిస్తే దేశం, రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి సాధిస్తుందని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. స్థానిక స్ఫూర్తి భవనంలో గురువారం సంఘం జిల్లా అధ్యక్షులు కంచర్ల గురవయ్య అధ్యక్షత నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలకు ఆహార ఉత్పత్తులను పండిస్తున్న రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలో అడవి బంజర్లు, ప్రభుత్వ పోరంబోకు భూములు, అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను పేదలకు దక్కేలా పోరాడాలన్నారు. బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియాలో సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 22న ఐటీడీఏ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మడిమి కామయ్య, కె.ఆనంద్, జిల్లా సహాయ కార్యదర్శులు గోలిమే బాల యేసు, కూరాకుల బాబురావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడారు.

సహకార రంగంతోనే ఆర్థిక అంతరాల తగ్గింపు



మాట్లాడుతున్న ఆచార్య నన్నపనేని అంజయ్య

ఏలూరు (టూటౌన్): సహకార రంగంతోనే ఆర్థిక అంతరాల తగ్గింపు సాధ్యమని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ డైరెక్టర్ ఆచార్య నన్నపనేని అంజయ్య పేర్కొన్నారు. 2025 ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఏలూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సహకార సదస్సులో అంజయ్య మాట్లాడారు. దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద బ్యాంకుగా ఆవిర్భవించిన ది విశాఖ పట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పేద, మధ్యతరగతి ప్రజలకు ఎక్కువ సేవలు చేయాలని ఆశిస్తుందన్నారు. ఏలూరు జిల్లా సహకార అధికారి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార రంగ సేవలు మరింత చేరువయ్యేటట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ బ్యాంక్ రూ.406 కోట్ల మూలధనంతో దేశంలోనే 1472 అర్బన్ బ్యాంకుల్లో మూడో స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార ఉపఅధికారి ఎ.వెంకటేశ్వరరావు, ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఠాగూర్, ఏలూరు బ్రాంచ్ మేనేజర్ కె.కొండబాబు, కనకమాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ ఏలూరు బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మేనేజర్ నరసింహం, ప్రముఖ న్యాయవాది రామకృష్ణ, సీఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ ఉద్యోగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆధారిత కోర్సులతో ఉపాధి



అతిథి ఉపన్యాస కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కంప్యూటర్ ఆధారిత కోర్సులతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నీడ్ ఆటోమేషన్ టెస్ట్ ఇంజినీర్, స్థానిక సీఆర్ఆర్ కాలేజీ పూర్వ విద్యార్థిని చాతుర్య అలజంగి అన్నారు. స్థానిక సీఆర్‌రెడ్డి మహిళా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఐటీ రంగంలో ప్రస్తుత కెరీర్ ట్రెండ్స్ అనే అంశంపై గురువారం ఏర్పాటుచేసిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ (ఏఐ అండ్ ఎంఎల్) అనేది కంపెనీలకు వ్యాపార విలువలను అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. క్లౌడ్ కంప్యూటింగ్ సురక్షితమైన, సమర్థవంతమైన క్లౌడ్ ఆధారిత వ్యవస్థలకు మారడానికి సహాయపడుతుందని వివరించారు. డేటాను నిజ సమయంలో కనుగొనడానికి వీలుగా, డేటా మూలానికి దగ్గరగా ప్రాసెస్ చేయడంలో ఎడ్జ్ కంప్యూటింగ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఆర్ఆర్ మహిళా కళాశాల ఇన్‌చార్జి కరెస్పాండెంట్ వంకినేని భానుప్రకాష్, ప్రిన్సిపాల్ జి.సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమ్మెకు ఆశ వర్కర్ల మద్దతు

ద్వారకాతిరుమల: పీహెచ్‌సీ వైద్యులు పది రోజులుగా తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి అన్నారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లి పీహెచ్‌సీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో, వైద్యుల సమ్మెకు సంఘీభావంగా ఆశ వర్కర్లు నల్ల బ్యాడ్జిలు ధరించి, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వైద్యులకు సకాలంలో ప్రమోషన్లు ఇవ్వాలని, ఇన్‌సర్వీస్ పీజీ కోట పునరుద్ధరించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న వైద్యులకు 50 శాతం మూల వేతనం ప్రత్యేకంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల నాయకురాలు లలిత తదితరులున్నారు.

4వ రోజుకు శానిటేషన్ కార్మికుల ధర్నా

జంగారెడ్డిగూడెం: నాలుగు నెలల వేతనాలు విడుదల చేసే వరకు విధులు బహిష్కరిస్తామని స్థానిక ఏరియా హాస్పిటల్ శానిటేషన్ కార్మికులు ఆందోళన చేపట్టారు. స్థానిక ఏరియా హాస్పిటల్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నా గురువారం 4వ రోజూ కొనసాగింది. సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహిస్తున్నారు. సంఘం గౌరవాధ్యక్షులు జంపన వెంకటరమణ రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావులు మాట్లాడారు. నాయకులు వేముల రాజు, మేరీ, దయామణి, ప్రభావతి, సీత, కృష్ణవేణి, జె.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

రుణ బకాయిలు చెల్లించండి

చింతలపూడి: ఎస్సీ కార్పొరేషన్ లోన్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏలూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి కోరారు. ఎస్సీ కార్పొరేషన్ రుణ బకాయిదారులు, అధికారులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆయన సమావేశం నిర్వహించారు. 2015–16 2016 – 17 – 18 సంవత్సరాల్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో 581 మందికి రుణాలు ఇవ్వగా, రూ.15.23 కోట్లు బకాయిలు ఉన్నాయని ముక్కంటి తెలిపారు. చింతలపూడి మండలంలో 13 కార్లకు రూ.83.16 లక్షల బకాయిలు ఉన్నట్టు చెప్పారు. సెల్ఫ్ ఎంప్లాయ్ స్కీమ్ కింద 38 మందికి రుణాలు ఇవ్వగా, రూ.51.98 లక్షలు పెండింగ్‌లో ఉందన్నారు. ఈ బకాయిలు కడితే కొత్తవారికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. బకాయిలు చెల్లించేందుకు ఎస్సీ కార్పొరేషన్ సిబ్బందిని లేదా నేరుగా తనను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురానకుమార్‌కు నివాళి



పురానకుమార్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): హార్యాన డీజీపీ, పోలీసు ఉన్నతాధికారుల వేధింపులకు, కుల వివక్షతకారణంగా ఆత్మహత్యకు పాల్పడిన ఏడీజీపీ వై.పురానకుమార్‌కు దళిత సేన ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్, ఏలూరు జిల్లా దళిత సేన ఇన్‌చార్జి పింగుల ఇదియా, కృష్ణాజిల్లా దళిత సేన ఇన్‌చార్జి బుసే అనిల్ కుమార్, లింగపాలెం మండల ప్రధాన కార్యదర్శి లక్క పాము దాసు తదితరులు పాల్గొన్నారు. పురాన కుమార్ ఆత్మహత్యకు కారుకులైన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అరెస్టు చేసి, సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలని రవి ప్రకాష్ డిమాండ్ చేశారు.

రూపాయికే బీఎస్ఎన్ఎల్ సిమ్

ఏలూరు (టూటౌన్): దీపావళి సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఒక్క రూపాయికే సిమ్, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటా,100 ఎస్ఎంఎస్‌లు, 30 రోజుల కాల వ్యవధిలో అద్భుతమైన కొత్త ప్లాన్‌ను అందిస్తున్నట్టు టెలికాం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మేనేజర్ ఎల్ శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లాన్ నవంబరు 15వ తేదీ వరకు ఉంటుందని, ఇది పోర్టబిలిటీలకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. పూర్తి వివరాలకు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	25	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	44	బీళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	36	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	48
బీరకాయలు	28	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	34	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70–90
క్యారెట్	54	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	26	పుదీనా	05
అనబకాయ (1)	25–35	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	29
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

దీపావళిలో జాగ్రత్తలు పాటించాలి



మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

ఏలూరు టౌన్: దీపావళి పండుగను ప్రజలంతా సంతోషంగా నిర్వహించుకోవాలని, బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ సూచించారు. ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ స్టేషన్‌లో గురువారం వన్‌టౌన్ పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఎస్సై మదీనా బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో దీపావళి పండుగలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించేలా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సచివాలయాల్లో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు దీపావళి సందర్భంగా బాణసంచా విషయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

దుప్పట్ల పంపిణీ



అంధులకు దుప్పట్లు పంచిన ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్ఫూర్తి దివ్యాంగుల సేవా సమితి సేవా కార్యక్రమాల్లో భాగంగా అంధ నిరుద్యోగులకు శుక్రవారం స్థానిక రామచంద్రరావు పేటలో సమితి అధ్యక్షుడు పి.దేవరాజు ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఉద్యోగి ఎ.నరసింహారావు సౌజన్యంతో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి కె.ఏసు రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ఊరట

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి, ధనిక కుటుంబాలతో సహా అన్ని వర్గాలకూ ఎంతో మేలు కలిగిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. గురువారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్ పోలీసు పెట్రోల్ బంకు వద్ద నుంచి పాత బస్టాండు వరకు ఆటోలు, మాక్సీ క్యాబ్‌లు, మోటారు క్యాబ్‌లు, చిన్న కార్లతో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ వెట్రిసెల్వి జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఉప రవాణా కమిషనరు షేక్ కరీం, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జున రావు, ఏలూరు నగరపాలక కమిషనరు ఎ.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా భూముల ఆధార్ లింక్ చేయించాలి

దెందులూరు: మండలంలో ఆక్వా రైతులు తమ భూములను ఆధార్ లింక్ చేయించాలని మత్స్యశాఖ ఏలూరు రూరల్ మండలం ఆఫీసర్ ఎ.సతీష్ కుమార్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఏపీ సదా చట్టం ప్రకారం ఆక్వా చెరువుల నమోదు ప్రక్రియ తప్పనిసరన్నారు. మత్స్యశాఖ అధికారులు గ్రామ స్థాయి ఉద్యోగుల సహకారంతో ఏలూరు రూరల్ మండలంలో ఇప్పటి వరకు 60 శాతం నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 40 శాతం నమోదు కావడానికి రైతులు మత్స్యశాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు జిల్లా సదస్సు

ఏలూరు (టూటౌన్): విద్యా, ఉపాధి రంగాల సంక్షోభం – విద్యార్థి, యువకుల ఆత్మహత్యలు అనే అంశంపై పీడీఎస్‌ఓ – ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు శుక్రవారం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని అల్లూరు సత్యనారాయణ భవన్‌లో నిర్వహించనున్నట్టు పీడీఎస్‌ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్ భాను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వక్తగా కవి, రచయిత, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ సుంకర గోపాల్, వక్తలుగా పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ భాస్కర్, ఎన్‌వైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాషా పాల్గొని మాట్లాడుతారని పేర్కొన్నారు.